

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తి

## అర్హులైన రైతులందరికీ రుణాలు అందిస్తాం

### మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి

పరకాల, జూలై 22 : అర్హులైన రైతులందరికీ రుణాలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో డీసీసీబీ పరకాల బ్రాంచ్ మేనేజర్‌తో పాలకవర్గ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రైతులకు వ్యవసాయ రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మాదారం పీఏసీఎస్ పరిధి రైతులు గతంలో తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే మరింత రుణాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. డీసీసీబీ పరకాల బ్రాంచ్ మేనేజర్ సౌందర్య, సీఈవో షర్ఫోద్దీన్, ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, పీఏసీఎస్ డైరెక్టర్లు విజేందర్‌రెడ్డి, డైగరాజు, రాజిరెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.



ఇల్లందలో మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

## గ్రామాల్లో హరితహారం మొక్కల పంపిణీ

వర్ధన్నపేట, జూలై 22 : వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ప్రజాప్రతినిధులు హరితహారం మొక్కలను పంపిణీ చేస్తున్నారు. హరిత తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా చేపడుతున్న హరితహారంలో భాగంగా ఈ ఏడాది కూడా నర్సరీల్లో పెద్ద సంఖ్యలో మొక్కలను పెంచింది. ఈజీఎస్, అటవీశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెంచిన మొక్కలను గ్రామాల్లో ప్రజలకు ఇంటికి ఐదు మొక్కల చొప్పున ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేస్తున్నారు. రహదారుల వెంట, ఖాళీ స్థలాల్లోనూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

## దాశరథికి ఘన నివాళి

పరకాల, జూలై 22 : సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్యులు జయంతి నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని అమరధామంలో సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాభారతి నాటక సంస్థ అధ్యక్షుడు ఏరుకొండ రాందాస్ మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు నాటి నిజాం నిరంకుశత్వంపై పోరాడారని, 'మా నిజాం రాజు.. జన్మజన్మల బూజు' అని నినదించి జైలు జీవితాన్ని గడిపారని తెలిపారు. తెలంగాణ గడ్డపై గడ్డిపోచ సైతం కత్తిపట్టి యుద్ధం చేస్తుందని, అగ్నిధార, రుద్రవీణ వంటి ఎన్నో రచనలు చేసి ఉద్యమాన్ని రగిలించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సాహితీ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి అడప రాజు, కవులు వజ్జీరు ప్రదీప్, బండారి రాజ్‌కుమార్, క్రాంతి, లెనిన్, తాటి హరీశ్, రసూల్ పాల్గొన్నారు.



దాశరథి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాహితీ మిత్ర మండలి బాధ్యులు

## గంగిరేణిగూడెం బస్సు సర్వీస్ పునఃప్రారంభం

పరకాల, జూలై 22 : గంగిరేణిగూడెం ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు పరకాల డిపో మేనేజర్ బీవీ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మొత్తం 9కాల్స్ రాగా ఏడుగురు గంగిరేణిగూడెం బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని కోరినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గోరికొత్తపల్లిని ఇటీవల మండల కేంద్రంగా ప్రకటించిన నేపథ్యంలో గ్రామానికి బస్సు సర్వీసు ఉండేలా చూడాలని గ్రామస్తులు డీఎంను కోరారు. దీంతో సోమవారం నుంచి గోరి కొత్తపల్లి, గంగిరేణిగూడెం బస్సు సర్వీసును ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కాగా ఆయా గ్రామాల ప్రజలు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోలే కీలకం

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

ఐనవోలు, జూలై 22 : ఓటరు జాబితా నవీకరణ, సవరణలో బూత్‌స్థాయి అధికారులదే(బీఎల్‌వో) కీలకపాత్ర అని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం మండలంలోని ఒంటిమామిడిపల్లి జడ్పీ పాఠశాలలో తహసీల్దార్ బోనగాని రాజేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి అధికారులు, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రెయినర్స్(ఏఎల్ఎంటీ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన అదనపు కలెక్టర్ తొలుత ట్రైనింగ్ ఏవిధంగా జరుగుతున్నదని, ట్రైనింగ్ బీఎల్‌వోలకు ఎంతమేరకు అర్థమవుతోందని ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడం చాలా అవసరమన్నారు. ఇందుకు బీఎల్‌వోలు బూత్ స్థాయి పరిధిలో ఇంటింటికి తిరిగి పూర్తి వివరాలు, ఆధారాలను సేకరించాలని సూచించారు. అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం రెండో రివిజన్ ప్రకారం నూతనంగా వచ్చిన నిబంధనలు, మార్పులు, సడలింపులపై బీఎల్‌వోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 6, 7, 8 ఫాంలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. నియోజకవర్గ ట్రైనర్లు ఇచ్చే శిక్షణ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, ఏమైనా అనుమానాలు ఉంటే ట్రైనర్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. తహసీల్దార్ బోనగాని రాజేశ్, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు రమేశ్‌చందర్, కే.సురేశ్‌బాబు పాల్గొన్నారు.



ఐనవోలులో బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ తానాజీ వాకడే



నడికూడ: బీఎల్‌వోల ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

## ఓటరుగా నమోదు చేయాలి

నడికూడ, జూలై 22 : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని పరకాల ఆర్డీవో కే శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 2023, జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండినవారందరూ ఫారం-6లో పూర్తి వివరాలు నింపి బీఎల్‌వోలకు గానీ, ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారు తమ వివరాలను సవరించుకోవాలనుకుంటే ఫారం-8లో వివరాలను అందజేయాలని కోరారు. తహసీల్దార్ వీ.మహేందర్, డీటీ సత్యనారాయణ, ఎఎస్‌వో నాగేందర్, ఆర్ఐ హేమానాయక్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

### ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

దామెర, జూలై 22 : మండలంలో 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రియాజొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఓటరు జాబితాలో ఇంటిపేర్లు, పేర్లు, చిరునామా విషయంలో తప్పులు ఉంటే బీఎల్‌వోలకు తెలియజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఓటరు జాబితా రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు బీఎల్‌వోల వద్ద ఉండే ఫారం-6 దరఖాస్తును పూర్తిచేసి అందజేయాలన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### రాయపర్తి ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి

రాయపర్తి, జూలై 22 : పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారం, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో మండలంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ జారీ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ మేళాను జడ్పీటీసీ రంగు కుమార్‌తో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ వచ్చిన యువతీ యువకులు, ప్రజలంతా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, పదో తరగతి మెమోల జిరాక్స్‌లు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. నిరక్షరాస్యులకు పదో తరగతి మెమో నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీ మండల నాయకుడు గబ్బెట బాబు, నలమాస సారయ్య, చిక్కొండ వీరస్వామి, కుందూరు యాదగిరిరెడ్డి, ఆశ్రఫ్‌పాషా, ఎల్లస్వామి, గౌస్‌నాయక్ పాల్గొన్నారు.



రాయపర్తిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గీసుగొండ, జూలై 22 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు అన్నారు. మండలంలోని కోనాయిమాకుల పీడీఆర్ గార్డెన్‌లో శనివారం యూత్ మండల అధ్యక్షుడు శిరిశే శ్రీకాంత్ అధ్యక్షతన వివిధ గ్రామాల బీఆర్ఎస్ యూత్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వీరగోని రాజుకుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సూచించారు. పార్టీ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, మండల దళితబంధు కన్వీనర్ కోట ప్రమోద్, కార్యదర్శి రజాక్, వివిధ గ్రామాల యూత్ అధ్యక్ష, కార్యదర్శులు కొంగర పూర్ణచందర్, రాజేందర్, కొంగర చంటి, ప్రసాద్, లెనిన్, నల్ల రాజ్‌కుమార్, అన్వేష్, ప్రభాకర్, అభిషేక్, నాగరాజు పాల్గొన్నారు.

### ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

సంగెం, జూలై 22 : బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తం అన్నారు. సోషల్ మీడియా సన్నాహక సమావేశంలో భాగంగా శనివారం మండలంలోని నార్లవాయి, బాలునాయక్ తండా గ్రామాల్లో యూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 24న పరకాలలో నిర్వహించే సోషల్ మీడియా సమావేశానికి ప్రతి గ్రామం నుంచి యువత అత్యధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. సర్పంచ్‌లు రజిని, రజితా రమేశ్, ఉపసర్పంచ్ మాదినేని కోటేశ్వర్, మాదినేని రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి బందెల రమేశ్‌బాబు, యూత్ అధ్యక్షులు పరమేశ్వర్, తిరుపతి పాల్గొన్నారు.



గీసుగొండ: సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు



సంగెం: సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం